యూరియాకు ప్రత్యామ్నాయం 'నానో'

- వ్యవసాయంలో కొత్త దిశ
- చీడపీడల సమస్యకు చెక్..
- వాతావరణ కాలుష్యం నియంత్రణ

పెద్దవంగర: వ్యవసాయ రంగంలో ఎరువుల వినియోగం పంటల దిగుబడి పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. రసాయన ఎరువులు అధికంగా వాడడంతో నేల సార శక్తిని తగ్గిపోవడంతోపాటు పర్యావరణ కాలుష్యం పెరగడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులకు అధిక దిగుబడులు అందించేందుకు పర్యావరణానికి అనుకూలంగా ఉండే నానో యూరియా సంప్రదాయ యూరియాకు ప్రత్యామ్నాయంగా నిలుస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలతో మండలంలో వరి సాగు ఊపందుకుంది. వరినాట్లు వేసిన 20రోజులలోపు పంటలకు యూరియా ఎరువు వేయడం తప్పనిసరి అవుతోంది. అయితే అవసరమైన మొత్తంలో యూరియా అందుబాటులో లేకపోవడం రైతులకు ఇబ్బందిగా మారింది. ఫెర్టిలైజర్ దుకాణాలు, సహకార సొసైటీల వద్ద పడిగాపులు కాస్తు యూరియా కోసం ఎదురు చూస్తున్నారు.

మండలంలో 13,005 ఎకరాలు వరి, 5,256 పత్తి, 371 మొక్కజొన్న, 44 ఎకరాలు కంది, 52 పెసర, 50 ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేస్తున్నారు. దీనికి గాను సుమారు 2వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటి వరకు కేవలం 720మెట్రిక్ టన్నులు చేరినట్లు వ్యవసాయ అధికారులు వెల్లడించారు.


నేలసారాన్ని కాపాడుతుంది..

నానో యూరియా అనేది ద్రవ రూపంలో ఉండే ఆధునిక ఎరువు. పంటల తక్కువ మోతాదులోనే ఎక్కువ పోషకాలు అందిస్తుంది. సంప్రదాయ యూరియాతో పోలిస్తే ఇది పర్యావరణానికి మేలు చేస్తుంది. నేలసారాన్ని కాపాడుతుంది. ఒక అర లీటర్ నానో యూరియా దాదాపు 40కిలోల గుళికల యూరియాకు సమానమని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. యూరియా కొరతను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితం నానో యూరియా పేరుతో ద్రవరూపంలో ఎరువును అందుబాటులోకి తెచ్చింది. కాగా రైతులకు దీనిపై పూర్తి అవగాహన లేక పోవడంతో నానోపై ఆసక్తి చూపడం లేదు. రైతుల అవసరాలను తీర్చేందుకు అలాగే నానో యూరియాతో లాభాలపై అవగాహన కల్పించేందుకు అధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖా అధికారి

అవగాహన కల్పిస్తున్నాం..



నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పిస్తునే ఉన్నాం. నానో యూరియా రసాయన ఎరువుల వాడకాన్ని చీడపీడల తగ్గిస్తుంది. నేల, గాలి, నీటి కాలుష్యాన్ని నియంత్రిస్తుంది. పత్రరంధ్రాల నుంచి మొక్క లోపలి భాగానికి సులభంగా ప్రవేశించి పంటల దిగుబడులు పెంచుతుంది.

- గుగులోతు స్వామినాయక్, ఏఓ

ప్రజాసమస్యలపై పోరాడాలి

కేసముద్రం: స్థానిక సమస్యలపై ఎప్పటికప్పుడు బీజేపీ శ్రేణులు సమస్యలపై పోరాటాలు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్‌నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పలు సమస్యలపై తహసీల్దార్ వివేక్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీల్లో అధికారులకు పరిపాలన భారం అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పాదిల నరసింహారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు బోగోజు నాగేశ్వరాచారి, ఉపేందర్, మండల ఉపాధ్యక్షులు మహేందర్‌రెడ్డి, చంద్రకళ, నరేష్, రాములు పాల్గొన్నారు.



కేసముద్రం: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

గార్ల: రాష్ట్రంలో అమలు గాని 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై రాష్ట్ర గిరిజన ఎస్టీ మోర్చా కార్యదర్శి భూక్యా శ్రీను నాయక్ మండిపడ్డారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం బీజేపీ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శారదకు అందజేశారు. కార్యక్రమంలో మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఆర్ విమల్‌జైన్, బీజేపీ మండల అధ్యక్షుడు నక్క శివకృష్ణ, వెంగల బుచ్చిబాబు, సాయికృష్ణ, జక్క సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇబ్బంది లేకుండా యూరియా అందిస్తాం

కురవి: రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యూరియా పంపిణీ చేస్తామని మండల స్పెషల్ అధికారి మాడిశెట్టి నరసింహస్వామి, డీపీఆర్‌ఓ రాజేంద్రప్రసాద్, ఏడీఏ విజయచంద్ర అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కర్షక సేవా సహకార సంఘంలో రైతులకు యూరియా పంపిణీ ప్రక్రియ కార్యక్రమాన్ని పరిశీలించారు. గోదాంను సందర్శించి యూరియా నిల్వలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలో రైతులకు యూరియా పంపిణీ విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. సహకార సంఘంలో 444బస్తాలు, నేరడలో 222బస్తాల యూరియాను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ నరసింహరావు, ఏఈఓలు రాజేశ్వరీ, లయ, రమ్య, దేవ, జయశ్రీ, విజేందర్, సొసైటీ అధికారి జితేందర్ పాల్గొన్నారు.



గోదాంను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పలువురికి జరిమానా

మహబూబాబాద్ రూరల్: మద్యం తాగి వాహనాలు నడిపిన 30మందికి జిల్లా కోర్టులో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రవికుమార్ జరిమానా విధించారని మహబూబాబాద్ టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి అన్నారు. వారిని మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా మొదటిసారి పట్టుబడిన కారణంగా ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున జరిమానా విధించారని తెలిపారు. ఇలా వరుసగా మూడుసార్లు పట్టుబడితే వారి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయిస్తామని, డ్రంక్‌అండ్ డ్రైవ్ టెస్టులో మోతాదుకు మించి పరీక్షలో తేలితే కేసు తీవ్రతను బట్టి జరిమానాతోపాటు రెండు రోజుల నుంచి వారంరోజుల పాటు జైలు శిక్ష విధిస్తారన్నారు. డ్రంక్‌అండ్ డ్రైవ్ కేసుల్లోని వ్యక్తులను కోర్టులో హాజరుపరచిన పీసీలు రమేష్, భాస్కర్‌ను సీఐ అభినందించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

డోర్నకల్: కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. మండలంలోని పెరుమాళ్లసంకీస గ్రామంలో శనివారం నిర్వహించిన ఇందిరమ్మ పల్లెప్రగతి యాత్రలో కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కాసం శేఖర్, ఆంగోత్ వెంకన్న, తాళ్లూరి హనుమంతరావు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు యోధుడు సురవరం



నెహ్రూసెంటర్: నివాళులర్పిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: కమ్యూనిస్టు యోధుడు మాజీ సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి అని సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ అన్నారు. అనారోగ్యంతో సుధాకర్ రెడ్డి మృతి చెందగా ఆయన చిత్రపటానికి జిల్లా కేంద్రంలో పార్టీ శ్రేణులు శనివారం నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ సహాయ కార్యదర్శులు రేషపల్లి నవీన్, వెంకన్న, సాంబలక్ష్మి, వీరవెల్లి రవి, నల్ల శ్రావణ్, ఫాతిమా పాల్గొన్నారు.

గూడూరు: సీపీఐ ఆల్ ఇండియా మాజీ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మృతి, వామపక్ష పార్టీలకు, పేద ప్రజలకు తీరని లోటు అని ఎంసీపీఐ(యూ) జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం సురవరం మృతికి సంతాపం తెలిపారు.

బయ్యారం: సురవరం సుధాకర్‌రెడ్డి మృతికి సీపీఐ మండల కార్యదర్శి సారిక శ్రీనివాస్ సంతాపం వ్యక్తం చేశారు. నాయకులు పద్మ, కళింగరెడ్డి, రాజు, స్వామి పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



మహబూబాబాద్ అర్బన్: నిరసన తెలుపుతున్న సంఘం నాయకులు



గూడూరు: నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు



మహబూబాబాద్‌లో..



గంగారం: ఆశ్రమోన్నత పాఠశాలలో..

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ శనివారం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కొత్త పెన్షన్ విధానంతో నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్

డీలర్లు నిబంధనలు పాటించాలి



నెల్లికుదురు: మాట్లాడుతున్న ఏఓ

నెల్లికుదురు: ఫర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్ డీలర్లు నిబంధనలు ఉల్లంఘించి యూరియా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ యాస్మిన్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం ఫర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్ డీలర్లు, ఆగ్రో రైతు సేవా కేంద్రాల డీలర్లు, పాక్స్ సీఈఓలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చందా నరేష్ పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

గంగారం: మండలంలో యూరియా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి వేణు శనివారం తెలిపారు. రైతులకు యూరియాను అందుబాటులో ఉండేలా ఏర్పాటుచేస్తున్నామని, రైతులు అందించాల్సిన యూరియాను బ్లాక్ మార్కెట్ తరలించి అధిక ధరలకు విక్రయించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

తొర్రూరు రూరల్: వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అన్నివర్గాల ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు కోరారు. శనివారం మండలంలోని చెర్లపాలెం స్కూల్‌లో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ విద్యాసాగర్, సూపర్‌వైజర్ రమేష్, హెచ్‌ఎం తనుజ, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

మహబూబాబాద్: పారిశుద్ధ్యం విషయంలో కార్మికులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని కమిషనర్ టి.రాజేశ్వర్ హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డులను శనివారం కమిషనర్ సందర్శించి, పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లపై వేసిన చెత్తను తొలగించాలన్నారు. కాల్వలను వెంటనే శుభ్రం చేసి బ్లీచింగ్‌పౌడర్ చల్లడంతోపాటు మురుగు నీరు నిల్వలు ఉన్న ప్రాంతాలలో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు ప్రతీ రోజు వార్డుల్లో తిరుగుతూ పనులను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో పర్యావరణ అధికారి గుజ్జు క్రాంతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు కరుణాకర్, రాజేష్ పాల్గొన్నారు.



సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్

సంక్షిప్త సమాచారం

రాహుల్‌గాంధీకి లేఖలు

నర్సింహులపేట: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తు శనివారం తెలంగాణ ఉద్యమకారులు కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీకి లేఖలను పంపారు. కార్యక్రమంలో ఉద్యమకారులు ఖాజామియా, ఉపేందర్, సమ్మయ్య, అంబరీష, శ్రీపాల్, సోమయ్య, శంకర్, సతీష్ పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

దంతాలపల్లి: మండలంలోని పెద్దముప్పారం గ్రామంలోని గల అమ్మఒడి అనాథాశ్రమంలో ఎస్సై రాజు రజిత దంపతుల కుమార్తె కృతిక పుట్టిన రోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం వృద్ధులకు పాలు, పండ్లు, బిర్యానీ అందజేశారు. అదనంగా ఒకనెలా రోజులకు సరిపడా నిత్యావసర వస్తువులను ఆశ్రమ నిర్వాహకులకు అందజేశారు.

ఆత్మీయ భరోసా అమలు చేయాలి

పెద్దవంగర: వ్యవసాయ కూలీలందరికీ వెంటనే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేసి రూ.12వేలు అందించాలని ఏపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ముంజపల్లి వీరన్న, టీయూసీఐ జిల్లా కమిటీ సభ్యులు చింత నవీన్, వీరన్న డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో తహసీల్దారు మహేందర్‌కు వినతిపత్రం అందజేశారు.

అదనపు తరగతి గదులను నిర్మించాలి

డోర్నకల్: మైనారిటీ బాలికల గురుకుల కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టాలని ముస్లిం మైనారిటీ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ఎండీ అఖిల్ ఉల్లా కోరారు. శనివారం మైనారిటీ గురుకుల సంస్థల రాష్ట్ర సెక్రెటరీ షఫియుల్లాను కలిసి వినతిపత్రం అందించారు.



మాజీ సర్పంచ్‌పై ఫిర్యాదు

కురవి: మాజీ సర్పంచ్‌పై చర్య తీసుకోవాలని బోడ కుమారి శనివారం కురవి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కురవి మండలం కొత్తూరు(జి) శివారు తాట్య తండాకు చెందిన బోడ కుమారిపై మాజీ సర్పంచ్ రమేష్ గొడవపడి కొట్టేందుకు యత్నించినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ..

గార్ల: బైక్ ప్రమాదంలో మృతి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు బాదం సురేందర్ కుటుంబాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య శనివారం పరామర్శించారు. మృతుడి కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, గుండా వెంకట్‌రెడ్డి, భూక్యా నాగేశ్వరరావు, పార్టీ దనియాకుల రామారావ పాల్గొన్నారు.

తల్లిని ఇంటికి తీసుకెళ్లిన కుమారుడు

గార్ల: 20రోజులుగా దుకాణాల ఎదుట పడుకుంటున్న వృద్ధురాలు జి.నర్సమ్మను ఆమె పెద్ద కుమారుడు శనివారం గార్లకు వచ్చి తన ఇంటికి తీసుకెళ్లాడు. గార్లకు చెందిన వృద్ధురాలికు ముగ్గురు కుమారులు, నలుగురు కూతుళ్లు ఉన్నా ఆమె ఆలనా పాలన ఎవరూ పట్టించుకోక పోవడంతో గార్ల నెహ్రూసెంటర్‌లోని ఒక దుకాణం ఎదుట 20 రోజులుగా పడుకుంటుంది. ఈ వృద్ధురాలి వీడియోలను స్థానికులు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో పెద్దకుమారుడు వెంటనే వచ్చి కన్నతల్లిని ఖమ్మంలోని తన ఇంటికి తీసుకెళ్లాడు.

విషమంగా చిన్నారి ఆరోగ్యస్థితి

బయ్యారం: తల్లి మందు తాగడం చూసి మండలంలోని కోడిపుంజులతండాలో శుక్రవారం మందు తాగిన కుమారుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చిన్నారి మున్న వైద్యం పొందుతున్నాడు. గడ్డిమందు కడుపులోపలికి వెళ్లడంతో ఏమి చెప్పలేని స్థితి ఉన్నట్లు వైద్యులు శనివారం పేర్కొన్నారు.

శ్రీకృష్ణుడి విగ్రహ శోభాయాత్ర

పెద్దవంగర: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక తొర్రూరు కమిటీ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు కనుల పండువగా జరిగాయి. శ్రీ కృష్ణుడి ప్రతిమను అలంకరించి శోభయాత్ర వైభవంగా నిర్వహించారు.

దాతల చేయూత అభినందనీయం

పెద్దవంగర: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం ప్రశంసనీయం అని ఎంఈఓ బుధారపు శ్రీనివాస్ అన్నారు. శనివారం కొరిపల్లి తండా ప్రాథమిక పాఠశాలలో టీక్యా తండాకు చెందిన బానోత్ నెహ్రూనాయక్ తన తల్లిదండ్రులు దావు-కమలమ్మ జ్ఞాపకార్థం రూ.22 వేల విలువైన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను అందజేశారు. హెచ్‌ఎం మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల దారి ఏర్పాటుకు కృషి

మరిపెడ రూరల్: మండలంలోని మంచ్యతండా పాఠశాల రహదారి కోసం దాతలు సహకరిస్తే తాను రహదారి ఏర్పాటుకు కృషి చేస్తానని డీఎస్‌ఎఫ్ఐ జాతీయ కన్వీనర్ వివేక్ అన్నారు. శనివారం మండలంలోని ఎల్లంపేట గ్రామ పంచాయతీ శివారు రహదారి లేని మంచ్యతండా ప్రాథమిక పాఠశాలను వివేక్ సందర్శించారు.

కూపన్లు ఇవ్వాలి

కురవి: మండలంలోని నేరడ గ్రామంలోని సొసైటీ గోదాంలో శనివారం యూరియా పంపిణీ చేశారు. అయితే గోదాం వద్దకు నేరడ, తట్టుపల్లి గ్రామాలతోపాటు వివిధ తండాల రైతులు తమకు కూపన్లు ఇవ్వాలని, కూపన్లు ఇచ్చిన తర్వాత యూరియా వచ్చినప్పుడు అందించాలని ఏఈఓ విజేందర్‌తో వాదనకు దిగారు. తహసీల్దార్ విజయ రావడంతో ఆమెకు రైతులు విన్నవించారు. ఆమె సూచన మేరకు ఏఈఓ కూపన్లు అందించారు.

అభినందనీయం

మరిపెడ రూరల్: మండలంలోని రాంపురం ఎంపీపీఎస్ పాఠశాల హెచ్‌ఎం గుర్రం వెంకన్న ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమంలో విద్యార్థుల సంఖ్యను 32నుంచి72 వరకు పెంచడం అభినందనీయమని కాంప్లెక్స్ హెచ్‌ఎం మంద జయ, రాంపురం హై స్కూల్ హెచ్‌ఎం శశిధర్ అన్నారు. శనివారం మండలంలోని రాంపురం ప్రాథమిక పాఠశాలకు పుస్తకాలను భద్ర పరుచుకునేందుకు దాత రామసహాయం విష్ణువర్ధన్‌రెడ్డి ర్యాక్‌ను బహూకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాయిపల్లి యాకయ్య, కనకం గణేష్, శ్రీధర్, రాజేశ్వరి, క్రాంతి పాల్గొన్నారు.

టీషర్టుల పంపిణీ

కురవి: మండలంలోని గుండ్రాతిమడుగు(వీలేజి) గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు టీషర్టులను, ఎన్ఎంఎంఎస్ పుస్తకాలను తెలుగు సమితి ఆఫ్ నేబ్రాస్కా, స్ఫూర్తి ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జానయ్య, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్, జంగిలి హరిప్రసాద్ పాల్గొన్నారు.

తిండితిప్పలు లేకుండా క్యూలో రైతులు



డోర్నకల్‌లో క్యూలో నిలబడిన రైతులు



మహబూబాబాద్ రూరల్: పేర్ల నమోదు కోసం క్యూలో నిలబడిన రైతులు



బయ్యారం: గంధంపల్లి-కొత్తపేటలో..




గూడూరు పీఏసీఎస్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

యూరియా కొరత రైతులను తిండితిప్పలు లేకుండా చేస్తోంది. పలానాచోటుకు యూరియా వచ్చిందని తెలిసిన వెంటనే రైతులు కుటుంబ సభ్యులతో కలిసి అక్కడకు చేరి క్యూలో నిలబడుతున్నారు. కొన్ని రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి. శనివారం పీఏసీఎస్‌లకు యూరియా లోడు రాగా పెద్ద సంఖ్యలో రైతులు బారులుదీరారు. భారీ సంఖ్యలో రైతులు రావడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

- సాక్షి నెట్‌వర్క్

విద్యారంగ సమస్యలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు



మాట్లాడుతున్న పృథ్వీ

మహబూబాబాద్ అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో తీసుకువస్తున్న విద్యార్థి వ్యతిరేక సంస్కరణలపై, ప్రభుత్వ విద్యను బలోపేతం శాస్త్రీయ విద్య, సమానత్వ సమాజ స్థాపనే ధ్యేయంగా భవిష్యత్ విద్యార్థి ఉద్యమాలను ఉధృతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యక్రమంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరిసింహరావు, జిల్లా నాయకులు ఉదయ్, శ్రవణ్, ఓంకార్, ప్రవీణ్, రోహిత్, జస్వంత్, రాంచరణ్, కార్తీక్, ప్రణీత్, రోహిత్, శ్రీకార్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గణపతి ఉత్సవాలకు రూ.50వేల విరాళం



దంతాలపల్లి: గణపతి నవరాత్రి ఉత్సవాలకు మండలంలోని దాట్ల మాజీ సర్పంచ్ కొమ్మినేని రవీందర్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులకు రూ.50వేల చెక్కును శనివారం అందజేశారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు పోతుమంచి కృష్ణమోహన్‌రాజు, సుంకరి భాస్కర్, చిత్తలూరి యాకన్న, గనగాని రమేష్ పాల్గొన్నారు.

పొలాల అమావాస్య పూజలు



మహబూబాబాద్ రూరల్: శ్రావణ మాసంలో వచ్చే అమావాస్యను పురస్కరించుకుని భక్తులు అత్యంత పవిత్రంగా భావిస్తూ భక్తిశ్రద్ధలతో పొలాల అమావాస్య పూజలను శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పాత బజారు, కొత్త బజారు ప్రాంతాల్లో గల ముత్యాలమ్మ అమ్మవార్ల ఆలయాల్లో తెల్లవారుజాము నుంచి భక్తులు దర్శనాలకు వచ్చి, మొక్కులు చెల్లించుకున్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

మహబూబాబాద్ అర్బన్: ప్రమోషన్‌లో ఎస్సీ ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందని జీఓ నంబర్ 2 అడక్యసిని రద్దు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చాగంటి ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో గుగులోతు మంగు, ఆంగోత్ బాబు, మమత, వీణ, కౌసల్య, సునీత, రమ పాల్గొన్నారు.

వైద్య పోస్టులను భర్తీ చేయాలని వినతి



కురవి: ఖాళీగా ఉన్న వైద్య పోస్టులను భర్తీ చేయాలని సీరోలు మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మలిశెట్టి వేణు శనివారం జిల్లా కేంద్రంలో డీఎంహెచ్‌ఓ రవిరాథోడ్‌కు వినతిపత్రం అందించారు. సీరోలు మండలం చింతపల్లి, కొత్తూరు(సీ) గ్రామాల్లో అదనంగా ఏఎన్ఎం పోస్టు భర్తీ చేయాలని, చింతపల్లిలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టును, కొత్తూరులో అదనంగా ఆశకార్యకర్త పోస్టును మంజూరు చేయాలని కోరారు. ఆశ కార్యకర్త పోస్టును గుజిలి తండాకు కేటాయించాలన్నారు.

విద్యుత్ సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

నర్సింహులపేట: గ్రామాల్లో ఎలాంటి విద్యుత్ సమస్యలున్నా సత్వరమే పరిష్కరించాలని విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ వేణుగోపాలాచారి అన్నారు. మండలంలోని కొమ్ములవంచ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారుల ఫోరం నిర్వహించారు. విద్యుత్ సమస్యలపై పలువురు వినతి పత్రాలను అందజేశారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

కొత్తగూడ: దారి మళ్లింపు గేటు వల్ల ప్రమాదాలు జరుగకుండా ఎస్సై రాజ్‌కుమార్ చర్యలు చేపట్టారు. గేటును ఢీకొని ఇద్దరికి గాయాలు అయిన సంఘటన తెలిసిందే. శనివారం స్పందించిన ఎస్సై వాహనాలు వస్తుంటే ముందు కనిపించే విధంగా గేటుకు రేడియం స్టిక్కర్లు అంటించారు.

ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలి

నెల్లికుదురు: మండలంలోని నూతనంగా నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్లకు తప్పకుండా ఇంకుడు గుంత నిర్మించుకోవాలని ఎంపీడీఓ సింగారపు కుమార్ కోరారు. మండలంలోని బోటిమీదితండా, నెల్లికుదురు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతోపాటు ప్రభుత్వ పాఠశాలలను శనివారం ఆయన పరిశీలించారు.

నెల్లికుదురులో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

నెల్లికుదురు: జిల్లాలోనే మొట్టమొదటి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉన్న నెల్లికుదురు మండల కేంద్రానికి ఇప్పటి వరకు డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయకపోవడం బాధాకరం అని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గంధసిరి జోతి బస్సు, కార్యదర్శి మధు ప్రభుత్వాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నెలకొన్న మౌలిక సమస్యలపై ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యార్థి పోరుగర్జన శనివారం నెల్లికుదురుకు చేరుకుంది. కార్యక్రమంలో నాయకులు అమీర్, రాకేష్, శృతి, మహేష్, ఆకాష్ పాల్గొన్నారు.